

# శీతకాల నౌకాయానం

ఓడ-ఫ్రీడ్‌రిక్ వెబర్-హాయిత్ చేరేంతవరకూ కాప్టెన్ ఎర్డ్‌మాన్‌కు మిస్ రీడ్-వెనీషియా రీడ్-ను గురించి అంతగా తెలియదు. ప్లిమత్‌లో ఆమె ఓడ ఎక్కింది. అయితే అప్పటికల్లా అందులో చాలామంది ప్రయాణికులను-ఫ్రెంచ్, బెల్జియన్, హాయితియన్‌లను ఓడ ఎక్కించుకున్నాడు; అందులో చాలామంది ఇంత క్రితం అతనితో ప్రయాణం చేసినవాళ్లే. అతను ఆమెకు ఛీఫ్ ఇంజనీరు టేబుల్ దగ్గర స్థానం కల్పించాడు.

ఫ్రీడ్‌రిక్ వెబర్ సరకులు రవాణా చేసే ఓడ; కొలంబియా తీరంలో హంబర్గు నుంచి కార్టెగ్నాకు ప్రయాణం చేస్తూ, మార్గమధ్యంలో వెస్టిండీస్‌లోని ఎన్నో ద్వీపాలను తాకుతూ వెళ్తుంది. జర్మనీ నుంచి ఫాస్ఫేట్లు, సిమెంటు తీసుకెళ్తూ కాఫీ, కలప తీసుకువస్తూ వుంటుంది. అయితే, ఓడ యజమానులు వెబర్ సోదరులు లాభసాటి అనిపిస్తే, మార్గాన్ని తప్పించి కూడా మిగతాచోట్ల నుంచి సరకులు రవాణా చేస్తూవుంటారు. నిజాయితీగా ఒక్క పైస వచ్చినా పశువులూ, గుర్రాలూ, బంగాళాదుంపలూ-ఏవైనా ఫ్రీడ్‌రిక్ వెబర్ రవాణా చేస్తుంది. సరకులతో పాటు పాసెంజర్లను కూడా తీసుకెళ్తుంది. ఓడ పై డెక్‌లో ఆరు కాబిన్లూ, కింది డెక్‌లో ఆరు కాబిన్లూ వున్నాయి. వసతి సౌకర్యం అంత విలాసవంతంగా వుండకపోయినా, ఇచ్చే ఆహారం బాగుంటుంది, కావలసినంత దొరుకుతుంది. పైగా ధర కూడా చౌక. రౌండ్ ట్రిప్పుకు తొమ్మిది వారాలు పడుతుంది. అందుకు వెనీషియా చెల్లించింది నలభై ఐదు పౌన్లు. చారిత్రాత్మకప్రాముఖ్యం వున్న ఆసక్తికరమైన ప్రదేశాలే కాక, ఎన్నో విషయాలను కూడా తెలుసుకోవచ్చని ఆమె ఆశించింది.

ఆమెకు ఏజెంటు ముందే చెప్పాడు. హాయితీలోని ఓప్రిన్స్ రేవు చేరిందాకా తను మరో స్త్రీతో కలిసి కాబిన్‌ను పంచుకోవలసివుంటుంది. వెనీషియాకేమీ అభ్యంతరం లేదు. ఆమెకు సాంగత్యం అంటే ఇష్టం. తను మదాం బోలిన్‌తో పాటు కాబిన్‌ను

**వింటర్ క్రూస్**
**ఆంగ్లమూలం: విలియం సోమర్‌సెట్ మామ్**

పంచుకోవాలని స్టీవర్డ్ చెప్పినప్పుడు, తన ఫ్రెంచ్ భాషను మెరుగు పరచుకునేందుకు దాన్ని అవకాశంగా భావించింది. అయితే, మదాం బోలిన్ నల్లతారులా వుండటంతో ఆమెకు నిరాశ అనిపించింది కానీ, మృదువైన వాటితోపాటు గరుకైనవి కూడా స్వీకరించాలనీ, అన్ని రకాలూ కలిస్తేనే ప్రపంచమవుతుందనీ ఆమె భావించింది. వెనీషియా మంచి ఓడ ప్రయాణికురాలు; ఆమె తాత నావెల్ ఆఫీసరు కనుక ఆ మాత్రం మనం ఆమె నుంచి ఆశించాల్సిందే. ఒకటి రెండు రోజులు వాతావరణం బాగనిపించకపోయినా, ఆ తర్వాత బాగైంది. కొద్దికాలంలోనే ఆమె తోటి ప్రయాణికులను పరిచయం చేసుకుంది. కలసిమెలసి వుండే స్వభావం ఆమెది. అందువల్లే ఆమె బిజినెస్‌లో కూడా పైకొచ్చింది; పశ్చిమ ఇంగ్లాండులోని ఓ చక్కటి ప్రదేశంలో ఆమెకో టీ షాపు వుంది. వచ్చిన ప్రతి కస్టమర్‌నూ నవ్వుతూ పలకరించేది; శీతకాలంలో షాపు మూసేసి, గడచిన నాలుగేళ్ల నుంచి ఓడ ప్రయాణం చేస్తోంది. అందువల్ల ఎంతో ఆసక్తికరమైన మనుషులను కలుసుకోవచ్చు, ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు అని ఆమె అనేది. క్రితం సారి మెడిటెరేనియన్ ప్రయాణంలో తనకు పరిచయమైన గొప్ప క్లాసు ప్రయాణికులు ఫ్రీడ్‌రిక్ వెబర్‌లో లేకపోయినప్పటికీ, ఆమె గొప్ప పోకడలు పోయే మనిషి కాదు. కొన్ని నచ్చకపోయినప్పటికీ మంచి వైపే దృష్టి నిలపాలని అనుకుంది ఆమె. చదవటం ఆమెకెంతో ఇష్టం. షిప్ లైబ్రరీలో ఫిలిప్స్ ఆపెన్‌హీమ్, ఎడ్గార్ వాలెస్, అగాథా క్రిస్టీ లాంటి

రచయితల పుస్తకాలెన్నో చూసి ఆమె సంతోషపడిపోయింది; కానీ, మాట్లాడటానికి అంతమంది మనుషులు దొరికాక, చదవటానికి ఆమెకు తీరిక దొరకలేదు. హాయితీలో ప్రయాణికు లందరూ దిగిపోయాక చదువుదామనుకుంది.

"సాహిత్యం కంటే మానవస్వభావ అధ్యయనం చాలా ముఖ్యమైంది" అనుకునేది ఆమె.

వెనీషియాకు బాగా మాట్లాడుతుంది అన్న పేరుంది. సముద్రం మీద ప్రయాణం చేస్తున్న అన్ని రోజుల్లో ఎప్పుడూ భోజనాల బల్ల దగ్గర సంభాషణ నీరసపడకుండా జాగ్రత్త పడ్డాననుకునేది ఆమె. జనాన్ని బయటికి తీసుకురావట మెలాగో ఆమెకు తెలుసు. ఓ విషయం గురించి మాట్లాడాక ఇంకేం లేదని అనుకున్నాక కూడా, దాన్ని పునరుజ్జీవింపజేయగలదు. లేదూ, మరో కొత్త విషయం ఆమె నాలిక మీద సిద్ధంగా వుంటుంది, మళ్లీ జనాన్ని సంభాషణలోకి దించటానికి. ఆమెకు వీడ్కోలివ్వటానికి వచ్చిన ఆమె స్నేహితురాలు, మిస్ ప్రిన్స్ అంది: "చూడే, వెనీషియా! మగవాళ్లకుండే బుర్ర నీకుంది. ఏ విషయాన్ని గురించైనా చెప్పటానికి నీకేదో ఒకటి వుంటుంది" అని.

"అందరి వట్లా నువ్వు ఆసక్తి చూపితే, అందరూ నీ వట్ల ఆసక్తి చూపుతారు" చెప్పింది, వెనీషియా నమ్రతగా. "అభ్యాసం పరిపూర్ణత్వాన్ని సిద్ధింపజేస్తుంది. కష్టపడే తత్వం నాలో ఎంతో వుంది. అదే మేధ అన్నాడు డికెన్స్."

మిస్ రీడ్ అసలు పేరు వెనీషియా కాదు. ఆమె పేరు అలిస్. ఆ పేరు ఆమెకిష్టం లేదు. అందుకే చిన్నపిల్లగా వున్నప్పుడే కవితాత్మకంగా వెనీషియా అన్న పేరు పెట్టుకుంది. తన వ్యక్తిత్వాని కది బాగా సరిపోతుందనుకునేది ఆమె.

వెనీషియా తోటి ప్రయాణికులతో ఆసక్తికరమైన సంభాషణలు జరిపింది. చివరికి ఓడ ఓప్రిన్స్ రేవుకు చేరి ప్రయాణికులంతా దిగిపోయాక ఆమె కెంతో దిగులనిపించింది. ఫ్రీడరిక్ వెబర్ అక్కడ రెండు రోజులాగింది. ఆ రెండు రోజుల్లో వట్నాన్నీ, పరిసరప్రాంతాలనూ చూసిందామె. మళ్లీ ఓడ ప్రయాణం మొదలెట్టాక మిగిలిన ప్రయాణీకురాలు ఆమె ఒక్కతే. ద్వీపం తీరం తాకుతూ, రకరకాల రేవుల్లో ఆగుతూ, సరకులు దించుతూ, ఎక్కించుకుంటూ ఓడ ప్రయాణించింది.

"ఇంతమంది మగవాళ్ల మధ్య ఒంటరిగా వున్నందుకు మీకేం ఇబ్బంది అనిపించటం లేదుగా, మిస్ రీడ్?" అనడిగాడు కాప్టెన్, తాము మధ్యాహ్నం భోజనానికి కూర్చునేముందు.

టేబుల్ దగ్గర అతనికి కుడి వైపున కూర్చునివుంది ఆమె. ఆ వక్కన ఫస్ట్ మేట్, ఛీఫ్ ఇంజనీరు, డాక్టరు కూర్చునివున్నారు.

"ప్రపంచం తెలిసిన స్త్రీని నేను, కాప్టెన్! ఓ భద్రమహిళ భద్రమహిళైతే, సజ్జనులు సజ్జనులుగానే వుంటారని నేననుకుంటూ వుంటాను."

"మేము మొదటి నుంచీ నావికులమండీ, మా నుంచి మీరెక్కువ ఆశించకూడదు."

"మంచి హృదయాలు కిరీటాల కంటే గొప్పవి, విశ్వాసం నార్మన్ రక్తం కంటే గొప్పది!"

అతను పొట్టిగా, గట్టిగా వుండే మనిషి. నున్నటి గుండు, నున్నటి గడ్డం, ఎర్రటి ముఖం. అతను తెల్లటి స్టైంగా షిష్టర్ వేసుకున్నాడు. భోజనసమయంలో తప్ప బటన్లు తీసేవాడు కాదు; అప్పుడు అతను జుట్టున్న ఛాతీ బయటపడేది. అతను సరదాగా వుండే మనిషి. రంకెలు వేయకుండా అతను మాట్లాడలేడు. వెనీషియాకు

**అనువాదం: కాకాని చక్రపాణి**

అతను గమ్మత్తయిన మనిషి అనిపించింది. అయితే, ఆమెను అర్థం చేసుకోగలిగే మనస్తత్వం. అందుకే కొన్ని పట్టించుకునేది కాదు ఆమె. ప్రయాణంలోనూ, ఆమె అక్కడ గడిపిన రెండు రోజుల అనుభవం వల్లా, హాయితీని గురించి ఆమె చాలా తెలుసుకుంది. అందుకే ఆమే ముందుగా సంభాషణ మొదలెట్టింది. అయితే, ఆమెకు తెలుసు-మగవాళ్లకు వినటం కంటే, మాట్లాడటమే ఇష్టమని. ఆమె వాళ్లను ఎన్నో ప్రశ్నలు వేసింది. వాటికి జవాబులు ఆమెకు తెలుసు. కానీ వాళ్లకు తెలియవు, విచిత్రంగా. ఇంక ఆమెకు భోజనమయ్యే లోపల ఓ చిన్న ఉపన్యాసం ఇవ్వక తప్పలేదు. ఆ దేశచరిత్ర, ఆర్థికపరిస్థితి, దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, దేశభవిష్యత్తు మొదలైన విషయాలకు సంబంధించిన విపులసమాచారం ఆమె వాళ్లకు అందించింది. ఆమె మెల్లగా మాట్లాడింది. సంస్కారపూరితమైన గొంతు, పదజాలం విస్తృతమైంది.

పొద్దువాలే సమయానికి ఓడ ఓ చిన్న రేవు చేరుకుంది. అక్కడ మూడొందల కాఫీ సంచులు లోడ్ చేసుకోవాలి. ఏజెంటు ఓడ పైకి వచ్చాడు. కాప్టెన్ అతన్ని రాత్రి భోజనానికి వుండమని ఆహ్వానించాడు; కాక్ టైల్స్‌కు ఆదేశమిచ్చాడు. స్టీవర్డ్ వాటిని తీసుకువస్తూండగానే వెనీషియా సెలూన్‌లోకి మెల్లగా వచ్చింది. ఆమె కదలికలు నిశ్చయంగా, అందంగా, ఆత్మవిశ్వాసాన్ని వెలార్చేవిగా వున్నాయి. ఓ స్త్రీ నడకను బట్టి ఆమె భద్రమహిళో, కాదో, వెంటనే చెప్పేయవచ్చని ఆమె ఎప్పుడూ అంటూవుండేది. కాప్టెన్ ఆమెకు ఏజెంటును పరిచయం చేశాడు. ఆమె కూర్చుంది.

"ఏమిటీ మీరు తాగుతున్నది?" ఆమె అడిగింది.

"కాక్ టైల్. మీరూ పుచ్చుకుంటారా, మిస్ రీడ్?"

"నా కభ్యంతరం లేదు."

ఆమె అది తాగింది. తనింకొకటి తాగుతుందేమోనని సందేహంగానే అడిగాడు కాప్టెన్.

"ఇంకోటా? సరే, మీ కోసం."

చాలామంది కంటే తెల్లగానూ, చాలామంది కంటే నల్లగానూ, వుండే ఏజెంట్ జర్మన్ కోర్టులో హాయితీకి మాజీమంత్రి కొడుకు. అతను బెర్లిన్‌లో చాలా యేళ్లున్నాడు కనక జర్మన్ భాష బాగా మాట్లాడగలడు. నిజానికి అందువల్లే అతనికి జర్మన్ షిప్పింగ్ ఫరమ్‌లో ఉద్యోగమొచ్చింది. అది విన్నాక, వెనీషియా భోజనం చేసేటప్పుడు తను రైన్ దాకా చేసిన ప్రయాణం గురించి చెప్పుకువచ్చింది. ఆ తర్వాత ఆమే, ఏజెంటూ, కాప్టెనూ, డాక్టరూ, మేటూ కూర్చుని బీరు తాగారు. వెనీషియా ఏజెంటును మాట్లాడించే ప్రయత్నం చేసింది. వాళ్లు కాఫీ లోడ్ చేస్తున్నారు కనుక బహుశా సిలోన్‌లో టీ తోటల నెలా పెంచుతారో అతను తెలుసుకోవా లనుకోవచ్చునుకుంది ఆమె. అవును, తను సిలోన్‌కు నౌకాప్రయాణం చేసింది. పైగా అతని తండ్రి డిప్లొమాట్. కనుక అతనికి ఇంగ్లాండు రాజకుటుంబాన్ని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం వుండొచ్చు. ఆ రోజలా చక్కటి సాయంకాలాన్ని గడిపిందామె. చివరి కామె విశ్రమించటానికి-పడుకోటానికి అని ఆమె అనదు కనుక-వెళ్లాక, ఆమె తనలో తాననుకుంది: "సందేహం లేదు, ప్రయాణం చక్కటి విద్య గరపుతుంది."

అందరు మగవాళ్ల మధ్య ఆమె ఒంటరిగా వుండటం నిజానికి పెద్ద అనుభవమే. తనింటికి వెళ్లాక, ఆ విషయం చెప్పినప్పుడు వాళ్లంతా ఎంతగా నవ్వుతారో! అలాంటి సంఘటనలు వెనీషియాకు మాత్రమే జరుగుతాయి అనంటారు వాళ్లు. డెక్ మీద బొంగురు గొంతుతో కాప్టెన్ పాడుతున్న పాట విని ఆమె నవ్వుకుంది. జర్మన్లు అంత సంగీతప్రియులు మరి! తన పొట్టికాళ్లతో అటూ ఇటూ నడుస్తూ వేగ్నర్ ట్యూన్లకు తన

సొంతమాటలను చేరుస్తూ పాడటం గమ్మత్తుగా వుంది. తనకు జర్మన్ తెలీదు కనుక అతను ఎలాంటి అర్థం లేని మాటలు పాడకు జోడిస్తున్నాడో అనుకుంది ఆమె. అదే జరుగుతోంది.

"అమ్మో, ఎంత బోరో ఆ ఆడది! ఇలాగే కొనసాగిస్తే ఆమెను ఛంపేస్తాను!" అప్పుడతను సీజ్ ఫ్రెడ్ ట్యూనందుకున్నాడు. "బోరు కొట్టేస్తోంది ఆడది. వట్టి బోర్! వట్టి బోర్! ఆమెను సముద్రంలోకి విసిరేస్తాను!"

వెనీషియా నిజానికి విసిగించే మనిషే. ఆమె బుర్ర బద్దలు కొడుతుంది. భరించటం కష్టం ఆమెను. బుర్రను తొలిచేసే బోర్. ఒకే గొంతుతో మాట్లాడుతూవుంటుంది. ఆమె వాగ్ప్రవాహానికి అడ్డు కట్ట వేయటం కూడా ప్రమాదమే. ఎందుకంటే ఆమె మళ్లీ మొదటి నుంచీ ప్రారంభిస్తుంది. సమాచారసేకరణ పట్ల ఆమెకు తీరని దాహం. బల్ల దగ్గర కూర్చుని మామూలు మాటలు కూడా మాట్లాడుకోటం కష్టం. ఎందుకంటే వాటి గురించి ఆమె ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తూవుంటుంది. ప్రతి విషయం మీదా ఆమె మాట్లాడలేని చెత్త లేదు. ప్రతి సందర్భానికీ సరిపోయే పడికట్టు రాళ్లుంటాయి ఆమె దగ్గర. మేకును గోడలోకి సుత్తితో కొట్టినట్టు మామూలు విషయాన్ని కూడా బలంగా చెప్పేది. సర్కస్‌లో విదూషకుడు రింగులోంచి దూకినట్టు ఆమె అందరికీ తెలిసిన విషయాల్లోకి దూకేది. నిశ్శబ్దం ఆమెను సిగ్గు పరిచేది కాదు. పాపం, ఆ మగాళ్లు ఇంటి నుంచి దూరంగా, క్రిస్మస్ దగ్గరికి వస్తూన్నా తాము దూరంగా వుండిపోయినందుకు ఖిన్నులై వున్నారు; వాళ్లకు ఆసక్తీ, వేడుకా కలిగించటానికి ఆమె తన ప్రయత్నాలు ద్విగుణీకృతం చేసింది. ఉల్లాసం లేని వాళ్ల బతుకుల్లోకి ఏ మాత్రం సంతోషమైనా తీసుకురావాలని ఆమె కృతనిశ్చయంతో వుంది. అదే అందులోని భయంకరత్వం! వెనీషియా మంచే చేయాలనుకుంది. తను ఉల్లాసంగా గడపటమే కాదు, అందరికీ వుల్లాసమివ్వాలనే ప్రయత్నించింది. తనకు వాళ్లంటే ఎంత ఇష్టమో, వాళ్లకూ తనంటే అంత ఇష్టమని అనుకుంది ఆమె. పార్టీని విజయవంతం చేయటంలో తను చేయగలిగింది చేస్తూందనుకుందామె. అందులో తను విజయం పొందుతున్నానని అమాయకంగా సంతోషపడింది.

వాళ్లందరికీ తన స్నేహితురాలు మిస్ ప్రైస్‌ను గురించి చెప్పింది. ఆమె ఎప్పుడూ-వెనీషియా, నీ సాంగత్యంలో నీరసక్షణ మంటూ వుండదే-అనేదనీ చెప్పింది. పాసెంజర్ పట్ల మర్యాదగా వుండటం కాప్టెన్ ధర్మం. ఆమె నోరు మూయించాలని అతని కెంతున్నా మాట్లాడవద్దని చెప్పలేకపోయాడతను. తనకు కాప్టెన్ బాధ్యత లేకపోయినా ఆమెకలా చెప్పి, ఆమె మనసును గాయపరచలేడతను. ఆమె వాగ్ప్రవాహానికి అలా అడ్డు కట్ట లేకపోయింది. ప్రకృతిశక్తిలా నిరోధించసాధ్యం కానిదైపోయింది. నిస్సహాయంగా ఓ సారి వాళ్లు జర్మను భాషలో మాట్లాడుకోసాగారు.

కానీ, తక్షణమే వెనీషియా వాళ్లను ఆపేసింది. "నాకు తెలియని భాషలో మిమ్మల్ని నేను మాట్లాడుకోనివ్వను. మీ మహద్భాగ్యం వల్ల నేనిక్కడున్నాను. ఆ అవకాశాన్ని ఉపయోగించుకోండి. అభ్యాసం చేసి మీ ఇంగ్లీషును మెరుగు పరుచుకోండి."

"మేము సాంకేతికవిషయాలు మాట్లాడుకుంటున్నాము, మిస్ రీడ్! అవి మీకు బోరు కొట్టిస్తాయి" అన్నాడు కాప్టెన్.

"నా కెప్పుడూ బోరు కొట్టదు. అందుకే, మీరు గర్వం అనుకోకపోతే, నేనూ బోరు కొట్టను. విషయాలు తెలుసుకోవట మంటే నాకెంతో ఇష్టం. అన్నీ నాకాసక్తిని కలిగిస్తాయి. ఏ చిన్న సమాచారం ఎప్పుడు ఉపయోగపడుతుందో చెప్పలేం."

డాక్టరు పొడిగా చిరునవ్వు నవ్వాడు. "నిజానికి కాప్టెన్ సిగ్గుపడి మీ కా మాట చెప్పలేకపోయాడు. అతనో కథ చెప్తున్నాడు. అది మీలాంటి భద్రకన్యలు వినటానికి తగింది కాదు."

"నేను భద్రకన్యనే కానీ నేను ప్రపంచాన్ని గురించి తెలుసుకున్న స్త్రీని కూడా. ఓడ సరంగులు మునుల్లా వుంటారని నేననుకోను.

కాప్టెన్, మీరు నా ముందు ఏం చెప్పటానికీ సంకోచించనక్కర్లేదు. నాకు ఏం విన్నా దిగ్భ్రమ కలగదు. మీ కథేమిటో చెప్పండి."

డాక్టరు అరవయ్యేళ్ల మనిషి, వల్చటి నెరిసిన జుట్టు, నెరిసిన మీసాలు, మెరుస్తున్న చిన్న నీలం రంగు కళ్లు. అతను మౌనంగా, ముభావంగా వుండే మనిషి. వెనీషియా అతన్ని ఎంతగా సంభాషణలోకి దించాలని ప్రయత్నించినా, అతన్నుంచి ఒక్క మాట రాబట్టడం కూడా అసాధ్యమయేది. అయితే, పోరాడకుండా వెనుదిరిగే స్త్రీ కాదు ఆమె. ఓ రోజు పొద్దున ఓడ సముద్రం మీద ప్రయాణిస్తుంటే, అతను డెక్ మీద పుస్తకం చదువుతూ కూర్చునివుండటం ఆమె చూసింది. ఓ కుర్చీ లాగి అతని పక్కనేసుకుని కూర్చుంది.

"మీకు చదవటం ఇష్టమా, డాక్టర్?" అనడిగిందామె కులాసాగా.

"అవును."

"నాకూ అంతే. జర్మన్లందరిలాగా మీకూ సంగీతం ఇష్టమనుకున్నాను."

"సంగీతం నాకు ఇష్టమే."

"నాకూ అంతే. మిమ్మల్ని చూసిన క్షణం నుంచి మీరు చాలా తెలివిగలవా ళ్లనిపించింది నాకు."

అతను ఓ క్షణం ఆమె వంక చూసి, పెదాలు తడుపుకుంటూ చదవసాగాడు. వెనీషియా నిరుత్సాహపడలేదు.

"మనం ఎప్పుడైనా చదువుకోవచ్చు. నాకు మాత్రం మంచిపుస్తకం చదవటం కంటే బాగా మాట్లాడటం ఇష్టం. మీకూ?"


"లేదు."

"ఆసక్తికరమైన విషయం. ఎందుకో చెప్పండి!"

"అందుకు కారణమేం లేదు."

"విచిత్రంగా వుంది కదూ? నేనెప్పుడూ అనుకుంటాను, మానవస్వభావం విచిత్రమైందని. నాకైతే మనుషుల పట్ల మహాఆసక్తి. నాకు డాక్టర్లంటే ఇష్టం. వాళ్లకు మానవస్వభావం గురించి బాగా తెలుసు. కానీ, మీక్కూడా ఆశ్చర్యం గొలిపే సంగతొకటి చెప్పగలను. నాలాగా ఎవరైనా ఓ టీ షాపు నడిపిస్తే మనుషులను గురించి బాగా తెలుస్తుంది, అయితే కళ్లు తెరిచి గమనించాలనుకోండి."

డాక్టరు లేచాడు. "క్షమించండి



మిస్ రీడ్! నేనో పేషెంటును వెళ్లి చూడాలి."

"ఏమైనా మంచును బద్దలు కొట్టగలిగాను" అనుకుంది ఆమె, అతను నడిచివెళ్తుంటే. "అతనికి సిగ్గనుకుంటాను."

అయితే, ఒకటి రెండు రోజుల తర్వాత డాక్టరుకేం ఒంట్లో బాగుండలేదు. అతనికి అంతర్గతంగా రుగ్మతేదో వుంది. అది అతన్ని అప్పుడప్పుడూ బాధపెడుతూ వుంటుంది. అయితే, అది అతని కలవాటైపోయింది, దాన్ని గురించి చెప్పటం అతని కిష్టముండేది కాదు. అది పొడసూపినప్పుడు, తన్నెవరూ పట్టించుకోకూడదని అత ననుకుంటాడు. తన మానాన తనను వదిలేస్తే బాగుంటుందనుకుంటాడు. అతని కాబిన్ చిన్నది, సామానుతో నిండి ఇరుగ్గా వుంటుంది. అందులో కళ్లు మూసుకుని పడుకున్నాడు. వెనీషియా ప్రతి ఉదయం, సాయంకాలం డెక్ మీద అటూ ఇటూ పచార్లు చేస్తూ వ్యాయామం చేసేది. తను నిద్ర పోతున్నట్టు నటిస్తే, ఆమె తనకు నిద్రాభంగం చేయదని అతననుకున్నాడు. అయితే ఆమె చాలా సార్లు అతని పక్కగానే వెళ్లింది. ఈ సారి ఆమె అతని ముందు ఆగి, నిశ్చలంగా నిలబడింది. అతను కళ్లు మూసుకున్నా ఆమె తన వంకే చూస్తున్నదని అతనికి తెలుసు.

"నేను మీకు చేయగలిగినదేమైనా వుందా, డాక్టర్?" అడిగిందామె.

అతను కళ్లు తెరిచాడు: "ఏందుకూ. చేసేదేముందీ?"

ఆమె నతను చూశాడు. ఆమె కళ్లల్లో ఎంతో బాధ కనిపించింది. "మీ ఒంట్లో అసలేం బావున్నట్టు లేదు" అంది.

"బాధగా వుంది."

"నాకు తెలుసు. కనిపిస్తూనే వుంది. దానికేం చెయ్యలేమా?"

"లేదు. కొద్దిసేపుంటే అదే పోతుంది."

ఓ క్షణం సంకోచించి ఆమె వెళ్లిపోయింది. కాస్త సేపాగి తిరిగి వచ్చింది.

"కుషన్లు లేకపోతే మీకు అసౌకర్యంగా వున్నట్లుంది. నేను దిండు లేకుండా ప్రయాణం చెయ్యను. అది పట్టుకొచ్చాను. తల కింద పెడతా నుండండి."

వద్దని చెప్పటానికి కూడా వీల్లేనంత బాధగా వుంది అతనికి. ఆమె అతని తల ఎత్తి, ఆ మెత్తని దిండును అతని తల కింద పెట్టింది. నిజాని కది అతని కెంతో సౌఖ్యాన్నిచ్చింది. తన చేతిని అతని నుదుటి మీద వుంచింది. అది చల్లగా, మృదువుగా వుంది. "అయ్యో పాపం! డాక్టర్ల సంగతి నాకు తెలుసు. తమను గురించి తాము ఎలా శ్రద్ధ తీసుకోవాలో వాళ్లకు తెలీదు."

ఆమె అతన్ని వదిలి వెళ్లింది. కానీ, మరుక్షణంలో ఓ కుర్చీనీ, సంచీనీ పట్టుకుని తిరిగి వచ్చింది.

ఆమెను చూసిన డాక్టరు, బాధగా ముఖం చిట్లించాడు.

"నేనిప్పుడు మిమ్మల్ని మాట్లాడనివ్వను. మీ పక్కన కూర్చుని అల్లికపని చేసుకుంటాను. ఒంట్లో బాగుండనప్పుడు ఎవరైనా దగ్గరుంటే ఎంత సుఖంగా వుంటుందో నాకు తెలుసు."

ఆమె కుర్చీలో కూర్చుంది. తన సంచీ లోంచి ఇంకా పూర్తి కాని స్వెట్టర్‌ను బయటికి తీసి, సూదులు ఆడిస్తూ బిజీ అయిపోయింది. ఆమె ఒక్క మాట మాట్లాడలేదు. విచిత్రంగా డాక్టరుకు కూడా ఆమె సాంగత్యం ఉపశమనం కలిగించినట్లు వుంది. ఓడ మీద వున్న మరెవరూ తనకు ఒంట్లో బాగుండనట్లు గమనించను కూడా లేదు; అతనికి ఒంటరితన మనిపించింది. బుర్ర బద్దలు కొట్టే ఆ బోరింగు మనిషి చూపిన సానుభూతికి అతను కృతజ్ఞుడై పోయాడు. ఆమె నిశ్శబ్దంగా పని చేసుకోడం అతనికి హాయి అనిపించింది. కొద్ది సేపటిలోనే అతనికి నిద్ర పట్టింది. అతనికి మెలకువ వచ్చినపుడు కూడా ఆమె పక్కనే తన పని చేసుకుంటూ కూర్చుని వుంది. అతనికి బాధ తగ్గిపోయింది, కులాసా అనిపించింది.

మధ్యాహ్నం బాగా ఆలస్యంగా అతను సెలూన్‌లోకి వెళ్లాడు. కాప్టెన్, మేటు-హాన్స్ క్రూజ్ బీరు తాగుతూ కనిపించారతనికి.

"రండి, డాక్టర్. మేం యుద్ధతంత్రసమాలోచనం చేస్తున్నాం. ఎల్లుండి సిల్వెస్టర్ ఎబెండ్ అని మీకు గుర్తుందా?"

"లేకేం?"

సిల్వెస్టర్ ఎబెండ్ అంటే న్యూ ఇయర్స్ ఈవ్-కొత్త సంవత్సరం ముందు రోజు. అది జర్మన్లకు పండుగ. వాళ్లంతా ఉత్సాహంగా ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నారు. తమతోపాటు జర్మనీ నుంచి క్రిస్మస్ ట్రీ పట్టుకొచ్చారు వాళ్లు.

"ఇవాళ డిన్నరప్పుడు వెనీషియా పేట్రేగిపోయింది. ఒకటే వాగుడు! ఈ విషయంలో ఏదైనా తప్పక చెయ్యాలనే నిర్ణయానికి నేనూ, హాన్సూ వచ్చాం."

"ఇవాళ పొద్దున ఆమె నిశ్శబ్దంగా రెండు గంటలు నా పక్కన కూర్చుంది. నష్టపోయిన కాలాన్ని పూరించిందనుకుంటాను."

"కొంప నుంచీ, కుటుంబాన్నుంచీ దూరంగా వుండాల్సి రావటమే మహా దురదృష్టం మనకు. ఆ దురదృష్టాన్ని వీలైనంత అదృష్టంగా మార్చటమే మనం చెయ్యాల్సిన పని. సిల్వెస్టర్ ఎబెండ్‌ను హాయిగా, ఉల్లాసంగా జరపాలనుకుంటున్నాం. వెనీషియా విషయంలో మనమేమీ చెయ్యలేకపోతే మన కలాంటి అవకాశం వుండదు."


"ఆమె మనతో వుంటే మనమేం ఎంజాయ్ చెయ్యలేం. అంతా పాడు చేస్తుంది" అన్నాడు మేట్.

"సముద్రంలోకి విసిరేయటం తప్ప, ఆమెను వదిలించుకోవట మెలా?" అన్నాడు నవ్వుతూ డాక్టరు. "పాపం, ఆమె అంత దుర్మార్గపు మనిషి కాదు; ఆమెకు కావలసిందల్లా ఓ ప్రియుడు!"

"ఈ వయసులోనా?" అడిగాడు విస్మయంగా హాన్స్ క్రూజ్.

"ముఖ్యంగా ఈ వయసులోనే వుంది ఆ అవసరం. ఆ అసాధారణవాచాలతా, సమాచారం పట్ల ఆ కోరికా, ఆమె అడిగే వందల ప్రశ్నలూ, బోరు కొట్టటం, ఒకటే ఇదిగా మాట్లాడటం-అంతా గోల పెడుతున్న ఆమె కన్యత్వచిహ్నామే! ప్రియుడెవడైనా వుంటే ఆమెకు ప్రశాంతత నిస్తాడు. బిగుసుకుపోయిన ఆమె నరాలు సల్లిస్తాయి. కనీసం ఓ గంటైనా ఆమె బతకాలి. ఆమె అంతర్గతజీవుడు కోరుతున్న గాఢపరితృప్తి ప్రకోపించిన ఆమె వాక్కేంద్రాల గుండా వయునిస్తుంది, మనకు ప్రశాంతత లభిస్తుంది."

డాక్టరు హాస్యంగా



మాట్లాడుతున్నప్పుడు, అతని మాటల కసలర్థం ఏమిటో తెలుసుకోటం కొంచెం కష్టమే. అయితే, కాప్టెన్ నీలికళ్లు కొంటెగా మెరిశాయి.

"బాగుంది డాక్టర్. రోగనివారణ విషయంలో మీ మీద నాకు అపారవిశ్వాసం వుంది. మీరు సూచించిన విరుగుడు ప్రయోగించి చూడాల్సిందే! మీరు బ్రహ్మచారి కనుక మీరే దాన్ని ప్రయోగించటం మంచిది."

"క్షమించాలి కాప్టెన్! ఈ ఓడలో నా రక్షణలో వున్న రోగులకు విరుగుళ్లూ, మందులూ ప్రిస్క్రయిబ్ చెయ్యటం నా డ్యూటీ. అంతే కానీ నేనే స్వయంగా ఇవ్వటం కాదు. ఆ పైన, నేను అరవయ్యేళ్లు పైబడిన వాడిని."

"నేను పెళ్లాం, పెరిగిన పిల్లలూ వున్నవాడిని" అన్నాడు కాప్టెన్. "పైగా వయసు పైబడిన వాడిని, లావు, ఉబ్బసం. కనుక ఇలాంటి పని చేయటం నా వల్ల కాదు! ప్రకృతి నన్ను భర్తగానూ, తండ్రిగానూ తీర్చిదిద్దింది కానీ ప్రియుడుగా మాత్రం కాదు!"

"ఇలాంటి విషయాల్లో యవ్వనం చాలా అవసరం. అందం వుంటే మరీ మంచిది" అన్నాడు డాక్టరు గంభీరంగా.

పిడికిలి బిగించి బల్లను గట్టిగా కొట్టాడు కాప్టెన్. "అంటే మీ దృష్టిలో హాన్స్ వున్నాడన్నమాట! బావుంది, హాన్స్ ఆ పని చెయ్యాలి."

ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు మేట్. "నేనా? అమ్మో! నా వల్ల కాదు!"

"హాన్స్, నువ్వు పొడుగ్గా, అందంగా వుంటావు. సింహంలాగ బలశాలివి, ధైర్యవంతుడివి, యువకుడివి. హంబర్గు చేరటానికి మనకింకా ఇరవై మూడు రోజుల ప్రయాణం వుంది. ఇలాంటి అత్యవసరపరిస్థితిలో నువ్వు నమ్మిన నీ కాప్టెన్, మంచి మిత్రుడైన డాక్టర్నూ ముంచటం సరైన పని కాదు."

"లేదు కాప్టెన్. మీరు నా నుంచి అతిగా ఆశిస్తున్నారు. నా పెళ్లయి ఏడాది కూడా కాలేదు. నా భార్యంటే నాకు ప్రేమ. హంబర్గుకు ఎప్పుడు చేరదామా అని ఎదురుచూస్తున్నాను. నా కోసం ఆమె తపించిపోతోంది, నేనూ ఆమె కోసం తపించిపోతున్నాను. ఆమె వట్ల నేను విశ్వాసఘాతకంగా ప్రవర్తించలేను. అదీ వెనీషియాతో...!"

"వెనీషియా అంత పనికిరాని దేం కాదు!" అన్నాడు డాక్టరు.

"కొంత మంది కనువిందుగా కూడా వుంటుందంటారు" అన్నాడు కాప్టెన్.

నిజానికి వెనీషియా ప్రతి లక్షణాన్నీ పరిశీలిస్తే ఆమేం సీదా సాదా మనిషి కాదు. నిజమే, ఆమె ముఖం పొడుగ్గా, మూర్ఖంగా వుండొచ్చు. కానీ ఆమె బ్రవును రంగు కళ్లు పెద్దవి. రెప్పల వెంట్రుకలు కూడా దట్టం; కత్తిరించుకున్న కపిలవర్ణపు జుట్టు, మెడ మీద రింగులు తిరిగివుంటుంది. చర్మం కూడా బానే వుంటుంది. మరీ అంత లావూ కాదు, మరీ అంత సన్నం కాదు. నిజానికి ఈ రోజుల బట్టి చూస్తే ఆమేం వయసు పైబడింది కాదు; తన వయసు నలభై అంటే ఎవరైనా నమ్మాల్సిందే. ఆమెలో లోపం ఒక్కటే-మందంగా, మెరుగు మాసిపోయినట్లు వుండటం.

"అంటే మరి నేను ఇరవై మూడు రోజుల సుదీర్ఘకాలం ఆ విసిగించే ఆడదాన్ని భరించాలా? ఈ ఇరవై మూడు రోజులూ ఆమె అర్థం పర్థం లేని ప్రశ్నలకు సమాధానమివ్వాలా? ఆమె చవిటిపర్ర వ్యాఖ్యానాలను వినాలా? అంటే, నేను, ముసలాణ్ణి, సిల్వెస్టర్ ఎబెండ్‌ను హాయిగా, జాలీగా గడుపుదామని ఎదురుచూస్తున్నవాడిని, ఆ సాయంకాలం ఈ భరించశక్యం కాని వృద్ధకన్య అప్రియసాంగత్యంతో చెడగొట్టుకోవాలా? అంతా ఎందుకూ? ఓ ఒంటరి ఆడదాని వట్ల కాస్తంత ధీరత్వం, కాస్తంత కనికరం, ఓ రవ్వ దాతృత్వం చూప నిరాకరించినట్లే కదా? ఈ ఓడను తగలబెట్టేస్తాను!"

"మన రేడియో ఆపరేటరున్నాడు కదా?" అన్నాడు హాన్స్.

కాప్టెన్ బిగ్గరగా నవ్వాడు. "హాన్స్, కన్యమాత లందరూ నిన్నాశీర్వదించాలి! చక్కటి మాట చెప్పావు. స్టీవర్డ్!" రంకెలేశాడు అతను, "రేడియో ఆపరేటర్‌ను వెంటనే పిలుచుకు రా!"

రేడియో ఆపరేటర్ సెలూన్‌లోకి వచ్చాడు. క్లిక్ మని చప్పుడు చేస్తూ స్మార్ట్‌గా సెల్యూట్ చేశాడు. ఆ ముగ్గురు మనుషులూ మౌనంగా అతని వంక చూశారు. తనేం పని చేశాడా, వీళ్లిక్కడ తనను శిక్షించటానికి కూర్చున్నారని అతను భయపడుతూ నిలబడ్డారు. మధ్యస్థపు ఎత్తు కంటే పొడవే అతను. చదునైన భుజాలు, సన్నని పిరుదులు, నిటారుగా, సన్నగా వున్నాడు. ఎండకు రంగు వాటారిన మెత్తటి చర్మం, గడ్డాన్ని రేజర్ స్పృశించినట్లు లేదు. చక్కటి పెద్ద నీలిరంగు కళ్లు. రింగులు తిరిగిన బంగారు వన్నె జుట్టు. ట్యూటానిక్ పురుషత్వానికి పరిపూర్ణప్రతీకగా వున్నాడతను. ఆరోగ్యంగా, బలంగా, చలాకీగా వున్నాడు. అతను దూరంగా నిలబడ్డా అతని పుంసత్వపు మెరుపును గమనించకుండా వుండలేం.

"ఆర్యుడివి. బావుంది. అందులో సందేహం లేదు. నీ వయసెంత, బాబూ?" అడిగాడు కాప్టెన్.

"ఇరవై ఒకటి సర్!"

"పెళ్లయిందా?"

"లేదు, సర్!"

"ఎవరినైనా ప్రేమించావా?"

రేడియో ఆపరేటర్ నవ్వాడు. మనసు నాకట్టే యవ్వనం ప్రస్ఫుటమైంది ఆ నవ్వులో.

"లేదు, సర్!"

"మన ఓడ మీద ఓ ఆడ పాసెంజరు వుందని నీకు తెలుసా?"

"తెలుసు, సర్!"

"ఆమె నీకు తెలుసా?"

"డెక్ మీద ఆమె కనిపించినప్పుడు గుడ్ మార్నింగ్ చెప్పాను, సర్!"

(ముగింపు వచ్చేవారం)

